నేడు మహా రుద్రాభిషేకం

జగద్గిరిగుట్ట: శ్రావణ అమావాస్య సందర్భంగా గురువారం మగ్దూం నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఉదయం లక్ష్మీగణపతి పూజ, రుద్రాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం, చండీ, రుద్ర హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



నీటి సమస్యను వివరిస్తున్న గణేష్

దుండిగల్: నీటి సమస్యను పరిష్కరించాలని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేశ్ కోరారు. దుండిగల్ గ్రామంలోని 3వ వార్డులో నీటి సమస్య వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన మున్సిపల్ ఏఈ సురేంద్ర నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ దుండిగల్‌లో పర్యటించారు. వారం రోజులుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, నిత్యం ప్రజలకు నీటిని సరఫరా చేయాలని కోరగా.. వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లద్దీపీర్ల నర్సింగ్‌గౌడ్, దొంతి మహేష్, ముకీత్, నాగరాజు పాల్గొన్నారు.

సమరయోధుల స్ఫూర్తిని కొనసాగించాలి



సుభాష్‌నగర్: దేశం గర్వించదగ్గ ఉద్యమకారుల్లో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లు ఒకరని, వారి స్ఫూర్తిని కొనసాగించాలని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. స్వాతంత్ర్యమే నా జన్మ హక్కు అని చాటి చెప్పిన సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ అని, బ్రిటిష్ వారి గుండెల్లో వణుకు పుట్టించిన సంగ్రామ వీరుడు చంద్రశేఖర్ జయంతిని సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. దేశం కోసం వారు చేసిన త్యాగాలను విద్యార్థులకు వివరించారు.

ముగిసిన కట్టమైసమ్మ ఆలయ వార్షికోత్సవం



కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయ సప్తమ వార్షిక వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఉదయం 7 గంటలకు చండీ నవ వర్ణార్చన, మహాచండీ హవనం, అష్టభైరవబలి, మహా బలిప్రదానం, ఉదయం 10.45 గంటలకు మహాపూర్ణాహుతి, మహా కుంభ సంప్రణ, వేద ఆశీర్వచనం, పండి సత్కారం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యువకుడికి దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

జీడిమెట్ల: బాలికను వేధిస్తున్న యువకుడికి కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా సిరోల్ మండలం మోదుగులగూడానికి చెందిన ఓ కుటుంబం నగరానికి వలస వచ్చి గాజులరామారంలో నివసిస్తున్నారు. గతంలో గ్రామంలో ఉండగా బాలిక(19)ను వినయ్ అనే యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. బాలిక జోలికి వెళ్లవద్దని పెద్దలు పేపర్‌పై రాయించి తీర్మానం చేశారు. యువకుడి వేధింపులు భరించలేక ఆ కుటుంబ సభ్యులు నగరానికి వలస వచ్చారు. మూడు నెలల క్రితం వినయ్ ఆమె ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో తల్లిదండ్రులు సిరోల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిని పలిపించి ఫొటోలు ఫోన్ నుంచి డిలీట్ చేయించారు. కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేశారు. బాలిక గాజులరామారంలోని ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తున్న విషయం తెలుసుకున్న వినయ్ బుధవారం మధ్యాహ్నం సూపర్ మార్కెట్‌కు వచ్చాడు. కత్తి కొనుగోలు చేసి ఆమె కోసం వేచి చూస్తున్నాడు. గమనించిన బాలిక భయంతో సూపర్ మార్కెట్ లోపలికి వెళ్లి దాక్కుంది. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కొంత మందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. వినయ్‌ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫెన్సింగ్ తొలగించి.. గదులు నిర్మించి !



ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలు

సర్వే నంబర్ 155లో ప్రభుత్వ స్థలం కబ్జా

- రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు
- అధికారులకు కాలనీవాసుల ఫిర్యాదు
- పట్టించుకోని యంత్రాంగం

చింతల్: ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అధికారుల నిఘా కరవడంతో రోజురోజుకు కబ్జాల పరంపర కొనసాగుతూనే ఉంది. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని సర్వే నంబర్ 155లో 3553 గజాల స్థలంలో జీహెచ్‌ఎంసీ అధికారులు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి మరి కబ్జాలకు పాల్పడుతున్నారు. 90 శాతం మేర ఫెన్సింగ్ పూర్తి చేసి వదిలేసిన ప్రాంతంలో ఇప్పటికి సుమారు 10 గదుల మేర అక్రమ నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో 3,553 గజాల స్థలంలో అక్రమ నిర్మాణాలతో సుమారు 1100 గజాల మేర ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైనట్లుంది. ఇక మిగిలిన స్థలంలో స్థానికంగా ఉండే అన్ని పార్టీల రాజకీయ నేతలు తమ వంతు ఎప్పుడు వస్తుంది.. అంటూ కొంతమంది డేగ కళ్లతో చూస్తూ కబ్జా ప్రయత్నాలను ముందరం చేస్తూనే ఉన్నట్లు భగత్‌సింగ్ నగర్ వాసులు ఆరోపిస్తున్నారు.

రాత్రికి రాత్రే వెలిసిన ప్రహరీ

భగత్‌సింగ్ నగర్‌లోని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అంటూ ఇప్పటికే గుడి కోసం కొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపట్టారు. ఇటీవల జరిగిన బోనాల పండుగ ఉత్సవాల్లో భాగంగా రాత్రికి రాత్రి గోడను నిర్మించి సుమారు 500 గజాల మేర ప్రభుత్వ స్థలానికి ఎసర పెట్టేందుకు తెల్లవారే సరికి నిర్మాణం పూర్తి చేశారు. సాయంత్రం వరకే వైట్ వాష్‌ను వేసేశారు.



గుడి పేరుతో సుమారు 500 గజాల స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

పట్టించుకోని అధికారులు

సర్వే నంబర్ 155లో 3,553 గజాల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని, ఇప్పటికే అక్కడ నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని భగత్ సింగ్ నగర్‌కు చెందిన కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారుల నుంచి ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదని ఫిర్యాదుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భగత్‌సింగ్ నగర్‌కు చెందిన గుడి కమిటీ సభ్యులతో పాటు పలు పార్టీల నాయకులు ఈ ప్రభుత్వ స్థలాలపై కన్నేసి చిన్న చిన్న గదులుగా నిర్మించి అమ్మకాలకు తెరలేపినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన హైడ్రా అధికారులు ఇప్పటికైనా చర్యలు స్పందించి అక్రమ గదుల నిర్మాణాలను తొలగించడంతో పాటు గుడి అభివృద్ధి పేరుతో నిర్మించిన ప్రహరీని కూల్చివేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై గాజులరామారం ఏసీపీ సుమిత్రను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం గాజులరామారం ఆక్సిజన్ పార్క్ వద్ద రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'వన మహోత్సవం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాతావరణ సమతుల్యతలో మొక్కలు కీలకమని అన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, బీట్ ఆఫీసర్ అర్షద్, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, స్థానిక కాలనీల సంక్షేమ సంఘం నాయకులు విజయ్ రాంరెడ్డి, కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, రుద్ర అశోక్, చిన్నా చౌదరి, రాములు గౌడ్, గోవర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా జర్నలిస్ట్ కాలనీ పరిసరాలు



నిజాంపేట్: నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం, వర్షాకాలం కావడంతో రోడ్లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాల్లో కలుపు మొక్కలు పెరుగుతున్నాయి. దీంతో విష పురుగులకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారాయి. ప్రతిరోజు కాలనీలోని ప్రజలు వివిధ పనులపై బయటికి వెళ్లడం, చిన్నపిల్లలు ఆడుకోవడం, పాఠశాలకు వెళ్లడం కారణంగా రోడ్లపై వస్తుంటారు. రాత్రి సమయంలో ట్యూషన్‌కి వెళ్లే పిల్లలు, స్థానిక ప్రజలు వివిధ పనుల మీద బయటకు రావడంతో చెట్ల పొదల్లో ఉన్న విష పురుగులు కాటు వేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కలుపు మొక్కలను తొలగించడంలో మున్సిపల్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉండే కావ్య హైట్స్ 405 ఫ్లాట్‌లో తల్లిదండ్రులు రమాదేవి, రఘువీర్‌లతో కలిసి 6వ తరగతి చదువుతున్న జాహ్నవి నివాసం ఉంటుంది. జాహ్నవి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి 8 గంటలకు లత లేక్‌వ్యూవ్ అపార్ట్‌మెంట్‌లో డ్యాన్స్ క్లాస్‌కు వెళ్తుండగా.. ఏదో కరిచినట్లు అనిపించింది. ఏడుస్తూ ఇంటికెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు 24 గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచాలని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాలనీలోని రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశంలో పెరిగిన మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

డీఈఓ విజయకుమారి

సుభాష్‌నగర్: వృత్తిలో ఉండగా చేసిన సేవలు గుర్తింపునిస్తాయని డీఈఓ విజయకుమారి అన్నారు. సూరారం జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సుఖ్‌దేవ్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని బుధవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సుఖ్‌దేవ్ దంపతులను సన్మానించారు. విద్యార్థులు హెచ్‌ఎంను గుర్రంపై ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. అంతకు ముందు డీఈఓ మాట్లాడుతూ.. ఆరుగురు ఉపాధ్యాయులు, రెండు గదులు మాత్రమే ఉన్న సూరారం జడ్పీహెచ్ స్కూల్ నేడు సుఖ్‌దేవ్ కృషి, పట్టుదలతో జిల్లాలోనే అతి పెద్ద పాఠశాలగా గుర్తింపు పొందిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహారావు, బేబీ, పులిందర్ రెడ్డి, వసంతప్ప, శ్రీధర్ రావు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజగంగా రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, అల్వాల్ మండలం ఎంఈఓ మురళీకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సుఖ్‌దేవ్ దంపతులను సన్మానించిన దృశ్యం

నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం

కుత్బుల్లాపూర్: నిరు పేదలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని బీఆర్‌ఎస్ నేతలు అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరినగర్‌కు చెందిన పి.హనుమంత్ రావు, గాజులరామారం డివిజన్ భవానీ నగర్ వాసి మహ్మద్ అజ్మాత్ అలీ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఎమ్మెల్యే వివేకానంద్ సాయంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి పి.హనుమంత్ రావుకు రూ.2 లక్షలు, అజ్మాత్ అలీకి రూ.1.50 లక్షల చెక్కులను మంజూరు చేయించారు. సదరు ఎల్‌ఓసీ చెక్కులను బుధవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, మల్లేష్ గౌడ్, పాపులు గౌడ్, విఠల్, అయోధ్య, వెంకటేష్, షమీమ్ బేగం, దుర్గా, ఫర్జానా బేగం పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించడం అభినందనీయం



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజలకు ఉపయోగపడే బస్‌షెల్టర్లు నిర్మించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలో దుందుముల్ల రాధమ్మ, లక్ష్మీనారాయణ రెడ్డి, దుందుముల్ల వెంకట రంగారెడ్డిల జ్ఞాపకార్థం దుందుముల్ల ఇంద్రసేనారెడ్డి నిర్మించిన బస్టాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడేలా ప్రతి ఒక్కరూ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, చిత్తరమ్మ ఆలయ చైర్మన్ అంతయ్య గౌడ్, బాలరాజు, మహేందర్ రెడ్డి, ఇంద్రసేన గుప్తా, లక్ష్మీనారాయణరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో ఒక్కరోజు తీర్థయాత్ర

జీడిమెట్ల: టీజీ ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఒక్కరోజు పుణ్య క్షేత్రాల యాత్రను ప్రయాణికులు వినియోగించుకోవాలని జీడిమెట్ల డీఎం బుధవారం ఓ ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం మెట్రో డిలక్స్ బస్సు గండిమైసమ్మ నుంచి బయలుదేరి అలంపూర్ శ్రీజోగులాంబ, పురాతన బాలబ్రహ్మేశ్వరస్వామి, శివాలయం, మంత్రాలయం, వేంకటేశ్వరస్వామి దర్శనం అవకాశం ఒక్కరోజులోనే కల్పిస్తుంది. తిరిగి అదేరోజు రాత్రి 12గంటలకు ప్రయాణికులను గండిమైసమ్మలో దింపివేస్తుంది. డిలక్స్ బస్సులో టీవీ సౌకర్యం కల్పించినట్లు డీఎం తెలిపారు. ఒక్కరోజు యాత్ర టిక్కెటు ధర పెద్దలకు రూ.1350, పిల్లలకు రూ.700 నిర్ణయించారు. టిఫిన్, భోజనాలు, దర్శన టిక్కెటు డబ్బులు యాత్రికులు భరించుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు ప్రయాణికులు ఫోన్ నంబర్ 9959226150, 9959615886లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీలతో..

జగద్గిరిగుట్ట: తెలంగాణలోని పలు ప్రాంతాల విహారయాత్రలకు కూకట్‌పల్లి డిపో నుంచి ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నట్లు సీబీఓ కూకట్‌పల్లి యాదగిరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి బస్ డిపో నుంచి ప్రతి శని, ఆదివారాల్లో తెలంగాణలోని పలు ప్రసిద్ధి చెందిన ఆలయాల దర్శించుకోవడానికి ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. రు.500 ముచ్చింతల్, కొత్తూరులోని అనంత పద్మనాభ స్వామి, షాద్‌నగర్‌లోని రామలింగేశ్వర స్వామి, అమ్మపల్లిలోని సీతారామ స్వామి ఆలయాలు సందర్శించవచ్చని, అలాగే రూ.1300 లతో రామప్ప, లక్నవరం, భద్రకాళి టెంపుల్, వెయ్యి స్తంభాల ఆలయాలు, రూ.700లతో అనంతగిరి టెంపుల్, అనంతగిరి హిల్స్, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాలు, స్పెషల్ ప్యాకేజీతో రూ.4500తో అరుణాచలం, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ వెళ్లిరావచ్చని, బుక్ చేసుకోవడానికి వివరాల కోసం 9949103328, 9177155057 సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వారికి జైలు శిక్ష



కుత్బుల్లాపూర్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులకు అత్వెల్లి మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించింది. అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు వివరాల ప్రకారం.. అల్వాల్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా.. ప్రసాద్, నరసింహ అనే ఇద్దరు వాహనదారులు పట్టుబడ్డారు. వారిలో బుధవారం అత్వెల్లి కోర్టులో ప్రవేశపెట్టగా.. రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. దీంతో వారిని అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.

న్యాయ సమ్మేళనానికి కదలాలి

జగద్గిరిగుట్ట: ఏఐసీసీ, ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 25న ఢిల్లీలో నిర్వహించే న్యాయ సమ్మేళనానికి అధిక సంఖ్యలో బీసీలు తరలి వెళ్లాలని ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం జగద్గిరిగుట్టలోని తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి కులగణన జరిపి బీసీలకు 42 శాతం బిల్లును అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. ఈ బిల్లుని అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం ఆలస్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ సమ్మేళనానికి తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో బీసీలు పాల్గొని సత్తా చాటాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలతా రెడ్డి అన్నారు. బుధవారం బాబాసాహెబ్ అంబేడ్కర్ అసోసియేషన్ బస్తీలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం స్థానికు సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు అంజద్, జహంగీర్, చిరంజీవి, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో డిప్యూటీ స్పీకర్

రంగారెడ్డినగర్: బోనాలు పండుగ తెలంగాణ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చి పెట్టిందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రాంచందర్ నాయక్ అన్నారు. మంగళవారం రాత్రి రంగారెడ్డినగర్‌లో జరిగిన బోనాల పండుగ ఫలహారబండి ఊరేగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన రాంచందర్‌నాయక్‌ను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, నాయకులు రఫీ, రాములన్న, బాలానగర్ సీఐ నరసింహారాజు, మాజీ వార్డు మెంబర్ భాస్కర్ రెడ్డి, కృష్ణ, సాగర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ స్పీకర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

'డబుల్' ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి రిమాండ్

83 మంది వద్ద డబ్బు వసూలు చేసిన నిందితుడు



హరిబాబు

జీడిమెట్ల: డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని పలువురి దగ్గర డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన వ్యక్తిని జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. బుధవారం జీడిమెట్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసీపీ పింగళి నరేష్‌రెడ్డి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎస్ఐ నాయుతో కలిసి వివరాలను వెల్లడించారు. 2023 సంవత్సరంలో ఎమ్మెల్యే వివేకానంద వద్ద హరిబాబు అనే వ్యక్తి వ్యక్తిగత సిబ్బందిగా పనిచేశాడు. అదే సంవత్సరంలో గిరినగర్‌కు చెందిన రమేష్.. తనకు డబుల్‌బెడ్‌రూం మంజూరు చేయాలని ఎమ్మెల్యే వివేకానందను కలిశారు. అదే కారణాన్ని ఆసరాగా చేసుకున్న హరిబాబు ఫోన్ ద్వారా రమేష్‌ను సంప్రదించి తనకు రూ.1 లక్ష ఇస్తే ఇళ్లు మంజూరు చేయిస్తానని రమేష్ నుంచి డబ్బు వసూలు చేశాడు. ఇలా 83 మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. ఈ నెల 14న రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బుధవారం హరిబాబును రిమాండుకు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరేష్‌రెడ్డి

హరిబాబుపై ఫిర్యాదు చేయించా : ఎమ్మెల్యే

హరిబాబుపై కేసు నమోదైన తర్వాత ఎమ్మెల్యే వివేకానంద బుధవారం సాయంత్రం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. హరిబాబును రెండున్నర సంవత్సరాల క్రితమే తన వద్ద నుంచి తీసివేశానని పేర్కొన్నారు. పలువురిని అతను మోసం చేయడాన్ని నచ్చకనే బాధితులతో ఫిర్యాదు చేయించానని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఆయా సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయినపల్లి ఏడీఏ జి శ్రీకాంత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి చిన్న తోకట్ట సబ్ స్టేషన్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు రాంగోపాల్ ఎంక్లేవ్, మారుతి నగర్, సాయిబాబా టెంపుల్ లైన్, సిండికేట్ బ్యాంక్ కాలనీ, వైష్ణవి రెసిడెన్సి, ఎస్ఆర్ ఎస్ఐ, ఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్, సాయి నిలయం, సాయికృష్ణ రెసిడెన్సి, దుబాయ్ గేట్ ఫీడర్ పరిధిలో వైష్ణవి మాత టెంపుల్, స్పెన్సర్స్, దుబాయ్ గేట్ తదితర ప్రాంతాలు, ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓల్డ్ బోయిన్‌పల్లి ఫీడర్ పరిధిలో బాలాజీ ఎంక్లేవ్, మల్లికార్జున కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, యాదవ బస్తీ, సాయి కృష్ణ కాలనీ, రమ్య హాస్పిటల్ లైన్, బోయిన్‌పల్లి ఎక్స్ రోడ్డు, చాత్రి గడ్డ, జీపీ సంఘం, మల్లికార్జున కాలనీ, మైనార్టీ స్కూల్ లైన్, భాగ్యశ్రీ గార్డెన్స్, హస్మత్ పేట ఫీడర్ పరిధిలో హస్మత్ పేట, ముస్లిం బస్తీ, లైమ్ స్టోన్ కాలనీ, అక్బార్ నగర్, ట్రినిటీ టవర్స్, ఎస్ ఎస్ రెసిడెన్సి, సూర్య ఎంక్లేవ్, జీహెచ్‌ఎంసీ మోడల్ మార్కెట్, సత్య అక్రేడ్, ఎమరాల్డ్ లేక్ రెసిడెన్సి, బోయిన్‌పల్లి సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి నాలుగు గంటల వరకు సంచారపురి ఫీడర్ పరిధిలో సంచారపురి కాలనీ, పబ్లిక్ సెక్టర్ కాలనీ, ఉమా నగర్ కాలనీ, రిలయన్స్ విల్లాస్, ముస్లిం గ్రేవ్ యార్డ్, తెలంగాణ గార్డెన్స్, జయనగర్ ఫీడర్ పరిధిలో జయనగర్, గల్ఫ్ బేకరీ, కడక్ పుర, కేఆర్ నగర్, నేతాజీ నగర్, న్యూ స్పోర్ట్స్, చిన్న తోకట్ట, విటల్ నగర్, జానకి నగర్, సాయంత్రం 4 నుంచి ఐదున్నర గంటల వరకు కలింగ ఎంక్లేవ్ ఫీడర్ పరిధిలో లెజెండ్ రెసిడెన్సి, ఏ హెచ్ కె ప్యాకింగ్, ఆర్ఆర్ టౌన్ షిప్, నాగిరెడ్డి కాలనీ, వల్లబ్ నగర్, పోచమ్మ టెంపుల్, మల్లికార్జున కాలనీ, పీవీ ఎంక్లేవ్, శ్రీ సత్య రెసిడెన్సి, వెంకటేశ్వర నివాస్, నాగిరెడ్డి కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, వల్లభ నగర్, ఎంఎస్ హోమ్ ఎక్విటైటిస్ ప్రాంతాల్లో నిలిపివేయనున్నారు.

జీడిమెట్ల: అపురూపాకాలనీ, దుర్గఎస్టేట్, ఎస్.ఆర్.నాయక్‌నగర్, మోడీ, జనప్రియ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సాయిబాబానగర్, సూరారంలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిలిపివేయనున్నారు. సూరారం శ్రీరాంనగర్, వెంకట్రాంనగర్, శ్రీకృష్ణనగర్, వైష్ణవినగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనుందని పేర్కొన్నారు.